క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి విశేష పూజలు



సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలిమంగమ్మ సమేత స్వామివారి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యాక్రమాలను చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారికి పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఉపాధి హామీలో ఇంకుడు గుంతలు



ముదుమలగుర్తిలో పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

కోడుమూరు రూరల్: ప్రజలంతా తమ ఇళ్ల ముందు మురుగునీరు నిల్వలేకుండా ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు తవ్వించుకోవాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. శనివారం మండలంలోని ముదుమలగుర్తి గ్రామంలో ఇళ్ల ముందు తవ్వుతున్న ఇంకుడు గుంతలను ఏపీఓ పరిశీలించారు. ముదుమలగుర్తి, బైన్‌దొడ్డి గ్రామాలకు 59 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయని తెలిపారు. అవసరమైన వారు ముందుకొస్తే ఉపాధి పథకం కింద తవ్విస్తామని పేర్కొన్నారు. ఒక్కో ఇంకుడు గుంతకు రూ.6 వేలు అందజేయడం జరుగుతుందని, ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈఓఆర్డీపై డీపీఓకు ఫిర్యాదు



డీపీఓకు ఫిర్యాదు చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

పాణ్యం: స్థానిక ఈఓఆర్డీ చంద్రమౌళేశ్వర్‌గౌడ్‌పై పాణ్యం ఉప సర్పంచ్ పాలెం చంద్రశేఖర్ రెడ్డి శనివారం నంద్యాల డీపీఓ జమివుల్లాను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మండలంలోని పంచాయతీలను ఈఓఆర్డీ నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. తనకు ఇష్టమొచ్చినట్లు బిల్లులు చేయిస్తున్నారని ఆరోపించారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలిపారు. ఆయనపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్తున్నట్లు తెలిపారు.

సేవాలాల్ మహరాజ్ జయంతి



రక్తదానం చేస్తున్న సేవాలాల్ యూత్ సభ్యులు

పాణ్యం: సేవాలాల్ మహరాజ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వమించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సేవాలాల్ మహరాజ్ యూత్ సభ్యులు రక్తదానం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

ఆలయంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



యాగంటీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, ఎన్ కొంతలపాడు గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఓర్వకల్లు గ్రూపు దేవాలయాధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానం ప్రాంగణంలో చెత్తను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. అదేవిధంగా ఎన్ కొంతలపాడు గ్రామంలోని యాగంటీశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో చెత్తను తొలగించారు.

చిన్నారుల వ్యాధులపై అవగాహన పెరగాలి

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు వచ్చేందుకు అవకాశమున్న క్యాన్సర్లు, వైకల్యాలపై తల్లిదండ్రులకు అవగాహన పెరగాలని చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ కమిటీ మెంబర్ రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. శనివారం చైల్డ్ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లల్లో వచ్చే అంగవైకల్యాలు, క్యాన్సర్ తదితర వ్యాధులపై స్థానిక మార్కెట్ యార్డు పరిసర ప్రాంతాల్లో ఇంటింటి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

విద్యుత్ చౌర్యం..
అధికారుల మౌనం

- రైతుల పేర్లతో విద్యుత్ కనెక్షన్లు
- చేపల చెరువులకు మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేసుకుంటున్న అక్రమార్కులు
- మండలంలో 40 వరకు అనధికార చేపల చెరువులు
- గతంలో 16 మందిపై కేసు నమోదు
- నామమాత్రపు చర్యలతో మళ్లీ అదే తంతు



విజిలెన్స్ దాడిలో తొలగించిన విద్యుత్ కనెక్షన్లు



గడిగేరేవులలో అక్రమంగా నిర్వహిస్తున్న చేపల చెరువు

గడివేముల: మండలంలో కొందరు అక్రమార్కులు రైతుల ముసుగులో విద్యుత్ కనెక్షన్లు తీసుకుని యథేచ్ఛగా అనధికార చేపల చెరువులకు వినియోగించుకుంటున్నారు. కొన్నేళ్ల నుంచి ఈ తంతు జరుగుతున్నా తమకేమీ తెలియనట్లు విద్యుత్ అధికారులు వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది. గతంలో గోరుకల్లు రిజర్వాయర్‌కు మట్టి కోసం రైతుల నుంచి పొలాలను కొనుగోలు చేసి మట్టిని తీసుకెళ్లారు. దీంతో పొలాల్లో గుంతలు ఏర్పడ్డాయి. వాటిలోనే నీటిని నింపి చేపల చెరువులుగా మార్చారు. గడివేముల మండల పరిధిలోని గడిగరేవుల, కొరటమద్ది, తిరుపాడు, దుర్వేసి గ్రామాల సమీపంలో దాదాపు 40 వరకు చేపల చెరువులను అనధికారికంగా నిర్వహిస్తున్నారు. చేపల చెరువులకు నీటిని తోడుకునేందుకు వ్యవసాయ రైతుల పేర్లతో విద్యుత్ కనెక్షన్ తీసుకుని అనధికారికంగా నాలుగు నుంచి ఐదు మోటర్లకు విద్యుత్ వినియోగించుకుంటూ వాటి ద్వారా చెరువులను నింపుకుంటున్నారు. దాదాపు కొన్ని ఏళ్ల నుంచి ఈ విధంగా వ్యవసాయ మోటర్లను చేపల చెరువులకు వినియోగిస్తున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వానికి రూ. లక్షలాది రూపాయలు గండి కొడుతున్నా ఏ అధికారి పట్టించుకోవడం లేదు. చేపల చెరువుల నిర్వాహకుల నుంచి ఎంతోకొంత తీసుకుని మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొంత మంది చేపల చెరువుల నిర్వాహకులు మాత్రం ఆక్వా నిర్వాణ కోసం ఒక మీటర్‌కు డబ్బులు చెల్లించి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని... అనధికారికంగా ఐదు నుంచి ఆరు మోటర్లకు విద్యుత్ కనెక్షన్ తీసుకుని చేపల చెరువులను నిర్వహిస్తున్నారు. ఏదో ఒక నెల విద్యుత్ బిల్లు చెల్లించడం ఆలస్యమైతే ఇంటికి కరెంటును కట్‌చేస్తున్న అధికారులు ఇంత భారీ ఎత్తున అక్రమాలు జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.



దాడులు నిర్వహించేందుకు వచ్చిన విజిలెన్స్ అధికారులు (ఫైల్)



ఉచిత విద్యుత్‌తో చేపల చెరువులోకి నీరు

దాడులు నిర్వహించినా భేఖాతరు

గడిగరేవుల, కొరటమద్ది, తిరుపాడు, దుర్వేసి గ్రామాల పరిధిలో కొన్నేళ్ల నుంచి 40 వరకు చేపల చెరువులను నిర్వహిస్తున్నారు. చేపల చెరువుల నిర్వాహకుల విభేదాల వల్ల ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో గత ఏడాది డిసెంబర్ 26వ తేదీ విజిలెన్స్ దాడులు జరిగాయి. అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న వారిని గుర్తించి సుమారు రూ.8 లక్షల అపరాధం విధించారు. అయినా కొందరు చేపల నిర్వాహకులు రైతుల పేర్లతో విద్యుత్ కనెక్షన్ తీసుకుని అక్రమ చేపల చెరువులకు నీటిని వినియోగిస్తున్నారు. అక్వా కింద విద్యుత్ కనెక్షన్ తీసుకుంటే ప్రతి నెలా రూ.వేలాది రూపాయాలు బిల్లు వస్తుంది. అదే రైతు పేరుతో తీసుకుంటే రూ.వంద రూపాయాల లోపే బిల్లు వచ్చే అవకాశం ఉంది. ప్రతి నెలా విద్యుత్ బిల్లులు తీసేందుకు వెళ్లే సిబ్బంది మామూళ్లు తీసుకుని మిన్నుకుండిపోతున్నారని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు.



రైతు మాటున ఆక్వాకు వాడుకుంటున్న మీటర్

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేద్దాం

- మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షలో ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అధికారులు సమన్వయంతో పనిచేసి, జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం కాల్వబుగ్గ దేవస్థానంలో శివరాత్రి ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఆలయ ఈఓ మద్దిలేటి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, డీఎస్‌ఓ మంజునాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తుల సంఖ్యకు అనుగుణంగా తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా స్నానపు ఘట్టాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రవాణా సౌలభ్యం కోసం కర్నూలు నుంచి సాధారణ బస్సు సర్వీసులతో పాటు, అవసరాన్ని బట్టి అదనపు బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. పారిశుద్ధ్యం, భద్రతపై దృష్టి సారించాలన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్‌ఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఏపీజీబీని కడపలోనే కొనసాగించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

కల్లూరు: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కల్లూరు ఎస్టేట్, చెన్నమ్మ సర్కిల్‌లో ఏపీజీబీ దగ్గర న్యూసిటీ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూసిటీ నగర కార్యదర్శి సాయిబాబా మాట్లాడుతూ.. మహిళల పొదుపు సంఘాల ఖాతాలు ఎక్కువగా ఏపీజీబీలోనే ఉన్నాయన్నారు. ఇతర జాతీయ బ్యాంకులకు సమానంగా సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో న్యూసిటీ నగర కార్యవర్గ సభ్యులు యేసు, నాయకులు లక్ష్మన్న, రాజు, దానమ్మ, జయరామ్, రమేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా చెత్త సేకరణ జరగాలి



వర్మీ యూనిట్‌ను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

పాణ్యం: గ్రామాల్లో వర్మీకంపోస్టు యూనిట్ల నిర్వహణ మరింత మెరుగుపడాలని నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అన్నారు. శనివారం పాణ్యం మండలంలోని మద్దూరు, భూపనపాడు గ్రామాల్లో పర్యటించారు. మద్దూరులో వర్మీ యూనిట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ పకడ్బందీగా జరగాలని ఆదేశించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా సహకరించాలన్నారు. అనంతరం భూపనపాడు గ్రామంలో ఈ–క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. త్వరితగతిన నమోదు ప్రక్రియ పూర్తి కావాలని సూచించారు. పంట నమోదు సమయంలో తప్పకుండా రైతులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి గ్రామం శుభ్రంగా ఉండేందుకు అందరూ సహకరించాలన్నారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఓఆర్డీ చంద్రమౌళేశ్వర్‌గౌడ్, వ్యవసాయ అధికారులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కల్లూరు: పాణ్యం నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కల్లూరు అర్బన్ పందిపాడు ఇందిరమ్మ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, నీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రమిచ్చారు.

రైతులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య

గడివేముల: కేంద్ర ప్రభుత్వం రైతులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇస్తోందని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కొరటమద్ది, గడిగరేవుల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు పొందడానికి ఈ గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. రైతులు భూమి పాసుపుస్తకం, వన్‌బీ, ఆధార్‌తో లింకైన మొబైల్ నంబర్‌తో స్థానిక రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

విద్యుత్ ప్రమాదంలో రెండు ఎద్దులు మృతి

కర్నూలు న్యూసిటీ: ప్రమాదవశాత్తు గుడిసెలో జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో రెండు ఎద్దులు మృతి చెందాయి. ఈ ఘటన నగరంలోని బుధవారపేటలో చోటుచేసుకుంది. శుక్రవారం అర్ధరాత్రి రంగన్న అనే వ్యక్తి గుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. క్రమంగా అవి వ్యాపించి గుడిసె మొత్తం కాలిపోయింది. ఈ ఘటనలో అందులో ఉన్న రెండు ఎద్దులు మృతి చెందాయి. ఆధారమైన ఎద్లను కోల్పోయి బాధిత రైతు రంగన్న శోక సంద్రంలో మునిగిపోయాడు. విషయం తెలుసున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బోరింగ్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



పీహెచ్‌సీలో చేతిపంపునకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

గడివేముల: స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఎట్టకేలకు చేతిపంపునకు మోక్షం లభించింది. కొద్ది నెలల నుంచి చేతిపంపు మరమ్మతులకు నోచుకోకపోవడంతో జనవరి 31వ తేదీ సాక్షిలో ప్రచురితమైన 'మరమ్మతులు చేసేదెవరు'వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. శనివారం పంచాయతీ కార్యదర్శి అంకన్న చేతిపంపునకు మరమ్మతులు చేయించారు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజలకు తాగునీటి సమస్య తీరింది. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెరగాలి



హుసేనాపురంలో సోక్ పిట్స్‌ను ప్రారంభిస్తున్న పీడీ

- డ్వామా పీడీ వెంకటరమణయ్య

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెరగాలని, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య సూచించారు. శనివారం మండలంలోని కాల్వ గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉదయాన్నే ఉపాధి పనులకు వెళ్లి కనీసం 4 గంటలు పనిచేసి దినసరి వేతనం రూ.300 పొందాలని సూచించారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలను కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అంతకు ముందు హుసేనాపురం గ్రామంలో సోక్ పిట్స్ పనులను ప్రారంభించారు. అనంతరం హుసేనాపురం, కాల్వ గ్రామాల్లో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ శ్రీనివాసులు, కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ కుమార్‌సాయినాథ్, సర్పంచ్‌లు చంద్ర గోవర్ధనమ్మ, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు చిన్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కర్నూలు రూరల్: అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీ



కోడమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ భాగ్యరత్న



గార్గేయపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, ఉద్యోగులు,

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



గూడూరు: పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

కోడుమూరు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని గూడూరు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. శనివారం గూడూరులోని 9వ వార్డులో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటి దగ్గరకు వచ్చే చెత్తసేకరణ వాహనాల్లో వేయాలని సూచించారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ అధికారులు విజయలక్ష్మి, రాఘవేంద్ర, కౌన్సిలర్ షాషావలి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

- కోడుమూరులో సర్పంచ్ భాగ్యరత్న ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై సర్పంచ్, ఈఓ అజయ్‌భాస్కర్ ప్రజలకు వివరించారు. ఇంటింటి నుంచి సేకరించిన తడి చెత్త- పొడి చెత్తతో వర్మీకంపోస్టు తయారు చేసే విధానంపై గ్రామ సచివాలయ సిబ్బందికి ఈఓ అవగాహన కల్పించారు.
- కర్నూలు(రూరల్): స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. రూరల్ మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో శనివారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ప్రతి నెలా మూడో శనివారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా పారిశుద్ధ్య పనులు చేయాలని సూచించారు. ఇటు మండల పరిధిలోని గార్గేయపురంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథ్, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.
- కల్లూరు: బాధ్యతాయుతమైన ప్రతి పౌరుడు పరిసరాల పరిశుభ్రతను తన బాధ్యతగా భావించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 20, 41వ వార్డు మాధవీనగర్, వీకర్ సెక్షన్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు తడి, పొడి చెత్త కుండీల వాడకం, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.బహిరంగంగా చెత్తవేసే అలవాటును మానుకోవాలని సూచించారు.
- సి.బెళగల్: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాల్లో డీడీ పాల్గొన్నారు. సి.బెళగల్‌లో సర్పంచ్ పాండురంగన్న చెత్త సంపద తయారీ కేంద్రంలో వానపాములను వదిలారు. ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో అధికారులు చెత్తను తొలగించారు.

ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ కీలకం

కర్నూలు కల్చరల్: ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తుందని రాయలసీమ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకె నాయక్ తెలిపారు. నగరంలోని ప్రసూన న్యాయ కళాశాల ఫ్రెషర్స్, ఫేర్‌వెల్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ వీసీ హాజరై మాట్లాడారు. జిల్లాలో ఉన్న ఏకైక న్యాయ కళాశాల అయిన ప్రసూన కాలేజీ ఎంతో మంది ఉత్తమ న్యాయవాదులు, న్యాయమూర్తులు, ఏపీపీలను అందించిందని అన్నారు. గౌరవప్రదమైన న్యాయ వృత్తిలో ఎంతోమంది బాధితులకు న్యాయం చేయవచ్చని సూచించారు. అనంతరం కాలేజీ ప్రిన్సిపాల్ శివాజీరావు మాట్లాడుతూ..న్యాయవాద వృత్తిలో రాణించాలంటే అంకిత భావంతో పాటు క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు.

యాగంటి ఆలయానికి రూ.11.65 లక్షల ఆదాయం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రం ఆవరణలో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణకు శనివారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.11.65 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రుడు తెలిపారు. వేలం పాటలో ఐదుగురు డిపాజిట్ చెల్లించి పాల్గొనగా పాతపాడు గ్రామానికి చెందిన మధుసుధాకర్ అత్యధికంగా రూ.11.65 లక్షలకు దక్కించుకున్నట్లు ఈఓ వెల్లడించారు. వేలం పాట పర్యవేక్షణాధికారిగా హరిశ్చంద్రారెడ్డి, యాగంటిపల్లె గ్రామ ఉపసర్పంచ్ బండిమౌలిశ్వరరెడ్డి పాల్గొన్నారు.